# అవినీతికి పాల్పడితే సహించం

- అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం
- ప్రజలకు మెరుగైన పాలన అందిస్తాం..
- ప్రాజెక్టుల పనులపై నివేదిక అందజేయాలి
- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు



మంత్రి జూపల్లి కృష్ణారావుకు జ్ఞాపికను అందజేసి సన్మానిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల, డిసెంబర్ 12 : ప్రజలకు మెరుగైన పాలన అందించడంతోపాటు, అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో అధికారులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి మంత్రి హాజరు కాగా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్సీ చల్లావెంకట్రామిరెడ్డి, గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, అదనపు కలెక్టర్లు శ్రీనివాసులు,అపూర్వచౌహాన్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా మంత్రి సివిల్‌సప్లయ్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జోగుళాంబ గద్వాల జిల్లాలో మూడు రైస్ మిల్లుల యజమానులు ప్రభుత్వం నుంచి వడ్లు తీసుకొని బియ్యం ఇవ్వకుండా రూ.100కోట్లకు అవినీతికి పాల్పడ్డారని ప్రచారం జరుగుతుందని, అవినీతికి పాల్పడ్డ మిల్లుల యజమానులపై ఎందుకు పీడీ యాక్ట్ నమోదు చేయలేదని ప్రశ్నించారు. మంత్రి అడిగిన ప్రశ్నకు ఆశాఖ అధికారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో రైస్ మిల్లర్లకు ఎన్ని క్వింటాళ్ల వరి ధాన్యం ఇచ్చారు, వారు ఎంత బియ్యం ప్రభుత్వానికి తిరి గి ఇచ్చారో చెప్పాలన్నారు. దీంతో అధికారి నుంచి సమాధానం రాలేదు. ఒక వేళ బియ్యం ఇవ్వని రైస్ మిల్లులపై కేసులు నమోదు చేశారా, చేయకపోతే ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పనితీరు ఇలా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఇరిగేషన్ శాఖపై మాట్లాడుతూ జిల్లాలో ఏవైనా ప్రాజెక్టుల్లో పెండింగ్ పనులు ఉన్నాయా.. ఉంటే ఎందుకు ఉన్నాయి వాటి పురోగతి ఏంటి మిగిలిన పనులు పూర్తి చేయాలంటే ఎన్ని నిధులు కావాలని ఆ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జూరాల, నెట్టెంపాడ్, ర్యాలంపాడు, ఆర్డీఎస్, తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఎంత వరకు ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యాయో నివేదిక అందజేయాలని ఆశాఖ అధికారులకు ఆదేశించారు.అబ్కారీశాఖపై మాట్లాడుతూ ఆబ్కారీశాఖలో ఏవైనా సమస్యలు ఉంటే చెప్పాలన్నారు. జిల్లాలో ఎన్ని సొసైటీలు ఉన్నాయి, కల్లు రసాయనాలతో తయారు చేస్తున్నారా లేక ఈత చెట్లకు గీసిన కల్లు ప్రజలకు విక్రయిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం, గుడుంబా విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు.అనంతరం వైద్యం, టూరిజం, పంచాయతీ రాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బీ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించి అందులోని పురోగతిని అధికారుల ద్వారా తెలుసుకున్నారు. అధికారులు ప్రజలకు పారదర్శకంగా అవినీతి లేని పాలన అందించాలని ఆదేశించారు. ధరణిలో సమస్యలు పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ధాన్యం సేకరణపై ఆరాతీశారు. జూరాల దగ్గర నిర్మిస్తున్న టూరిజం ప్రాజెక్టు పనులు, అలంపూర్‌లో జోగుళాంబ ఆలయంలో ప్రసాద్‌స్కీం పనులు 70శాతం పూర్తి కావచ్చాయని టూరిజం అధికారులు మంత్రికి తెలిపారు. ఆరోగ్యశాఖ గురించి మంత్రి ఆరా తీయగా జిల్లాలో గద్వాల 300పడకల దవాఖాన, అలంపూర్‌లో 100 పడకల దవాఖాన నిర్మాణ పనులు 90శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు చివరి దశకు వచ్చాయని వాటికి నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయడానికి సహకరించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, జెడ్పీవైస్ చైర్మన్ సరోజమ్మ, వైద్యాధికారులు శశికళ, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

### గైర్హాజరైన పర్యాటక శాఖాధికారులు

గద్వాల అర్బన్,డిసెంబర్ 12 : కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిర్వహించిన సమీక్షా సమావేశానికి పర్యాటక శాఖ అధికారులు హాజరుకాకపోవడం విస్మయానికి గురిచేసింది. మంత్రి అడిగిన ప్రశ్నలకు సమీక్షకు పర్యాటక శాఖకు తరపున హాజరైన వ్యక్తి సరైన సమాధానం చెప్పకపోవడంతో మంత్రి మీరు ఎవరు అంటూ అడగడంతో విషయం పొక్కింది. పర్యాటక శాఖ అధికారులు హాజరుకాకపోగా హరిత హోటల్ మేనేజర్‌కు వివరాలు పేపర్‌లో రాసి పంపించినట్లు విషయం బయటపడింది.

# జీపీ ఎన్నికల్లో సర్పంచులను గెలిపించుకునే బాధ్యత నాదే..

- బీఆర్ఎస్ పేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, డిసెంబర్ 12 : త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలను సర్పంచులుగా గెలిపించుకునే బాధ్యత తనదేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి రాజేందర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ కార్యాలయంలో నియోజకవర్గంలోని దామరగిద్ద, ధన్వాడ, పేట మండలాలతో పాటు పట్టణం నుంచి వచ్చిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలు పోటములు సహజమన్నారు. పదేండ్లుగా అధికారంలో ఉన్నాం, ఈ సారి ప్రజలు మార్పు కోరుకున్నారన్నారు. ఎన్నికల్లో కొంత మంది తన వెనకాల ఉండి తనకు మోసం చేశారని, ఇది కూడా ఓటమికి ఒక కారణమన్నారు. ఓటమి చెందినంత మాత్రాన కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దన్నారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఏ పార్టీకి లేనంతగా 47,200మంది కార్యకర్తల సభ్యత్వ బలం బీఆర్ఎస్‌కు ఉందన్నారు. రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారిస్తానని, నెలలో రెండుసార్లు సమీక్షా సమావేశం నిర్వహించి పార్టీని మరింత పటిష్ట పరుస్తానన్నారు. గెలిచిన ఎమ్మెల్యే చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు తన తరపున, పార్టీ కార్యకర్తల తరపున పూర్తి సహాయ సహకారాలు ఉం టాయన్నారు. అదే సమయంలో ని యోజకవర్గ ప్రజలు , రాష్ట్ర ప్రజలకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రజా క్షేత్రంలో ఎప్పటికప్పు డు నిలదీస్తామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యంపై సీఐకి జరిమానా

- జడ్చర్ల సీఐ రూ. 10వేలు కాస్ట్ చెల్లించాలని హైకోర్టు ఆదేశం

జడ్చర్లటౌన్, డిసెంబర్12 : ఓ కేసు విషయంలో జడ్చర్ల కోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటించకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జాప్యం చేసినందుకు గానూ జడ్చర్ల సీఐ రూ. 10వేలు కాస్ట్ చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే జడ్చర్లకు చెందిన మహిళ ప్రతిభ ఓ కేసు విషయంలో జడ్చర్ల కోర్టును ఆశ్రయించి పట్టణానికి చెందిన కౌకుంట్ల శ్యాంకుమార్, వెంకటేశ్‌గౌడ్ అనే ఇద్దరిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని కోరుతూ తన న్యాయవాదితో కోర్టులో ప్రైవేట్ కాంప్లెంట్ దాఖలు చేశారు. ఇందుకు జడ్చర్ల కోర్టు జడ్జి విచారించి వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఈఏడాది జూన్ 19న జడ్చర్ల సీఐకు ఆదేశాలిచ్చారు. సీఐ రమేశ్‌బాబు జడ్చర్ల కోర్టు ఆదేశాలను పాటించకుండా ఆలస్యంగా సెప్టెంబర్ 3వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ఈ క్రమంలో కోర్టు ఆదేశాలున్నా సీఐ రమేశ్‌బాబు ఉద్దేశ్య పూర్వకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ఆలస్యం చేశారని ఆరోపిస్తూ పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును సోమవారం హైకోర్టు న్యాయమూర్తి సీవీ భాస్కర్‌రెడ్డి విచారించి విధులపై నిర్లక్ష్యం వహించిన జడ్చర్ల సీఐ రమేశ్‌బాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రెండు వారాల్లోగా హైకోర్టు లీగల్ సర్వీసెస్ ఆథారిటీలో రూ.10వేలు కాస్ట్ చెల్లించాలని ఆదేశించారు.



లబ్ధిదారుడికి సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల

# ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, డిసెంబర్ 12 : ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అందించే సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జిలా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో గద్వాల మున్సిపాలిటీ 7వవార్డుకు చెందిన నఫీనా బేగం, కేటీదొడ్డి మండలం ఈర్లబండకు చెందిన చిన్న నర్సింహులు చికిత్సనిమిత్తం మంజూరైన రూ.60వేలు, రూ.48వేల విలువ గల చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనారోగ్యబారిన పడి వారు దవాఖానలో చికిత్స చేయించుకున్న తర్వాత సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే అయిన ఖర్చులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ సరోజమ్మ, కౌన్సిలర్ దౌలు నాయకులు, రమేశ్‌నాయుడు, మధు, ధర్మనాయుడు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# స్వామి దీవెనతో జిల్లా సస్యశ్యామలంగా ఉండాలి

- అయ్యప్పస్వామికి పూజలు చేసిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు,డిసెంబర్12 : అయ్యప్పస్వామి దీవెలనతో పాలమూరు జిల్లా సస్య శ్యామలంగా ఉండాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆకాంక్షించారు. జిల్లాకేంద్రం లోని మొనప్పగుట్టలో నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్పస్వాములకు భిక్షను వడ్డించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేశ్, కౌన్సిలర్లు కిశోర్ వేదవ్రత్, చిన్న, గురుస్వాములు, అయ్యప్పస్వాములు,భక్తులు పాల్గొన్నారు.

# బజాజ్ పల్సర్ బైక్ స్టంట్ షో అదుర్స్

- ఆకట్టుకున్న విన్యాసాలు



బజాజ్ పల్సర్ బైక్ స్టంట్ షోలో విన్యాసాలు ప్రదర్శిస్తున్న రైడర్

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 12 : జిల్లా కేంద్రం లోని స్టేడియం మైదానంలో హరూన్ బజాజ్ షోరూం ఆధ్వర్యంలో మంగళవారం పల్సర్ మానియా(బజాజ్ పల్సర్ బైక్) స్టంట్ షోలో బైక్ రైడర్స్ చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. షోను బజాజ్ తెలంగాణ రీజినల్ మేనేజర్ సాయిహరి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బజాజ్ పల్సర్ బైక్ విక్రయాల్లో ఒక ఏడాదిలో 10 లక్షలపైగా సేల్ చేసిన ఘనత దక్కిందన్నారు. దేశంలోనే ఫెవరేట్ స్పోర్ట్స్ బైక్‌గా నిలిచిందన్నారు. యువత ప్రత్యేకంగా పల్సర్ బైక్‌ను ఇష్టపడుతారని, భవిష్యత్‌లో మరిన్ని మాడల్స్ వ స్తాయని వెల్లడించారు. షోకు మంచి స్పందన వచ్చిందని, షోలో నైపుణ్యం కనబర్చిన పలువురికి బహు మతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వీస్ ఆర్ఎం స్టాలిన్, ఏరియా సెల్స్ ఇన్‌చార్జి సూర్యకిరణ్, సర్వీస్ ఏరియా మేనేజర్ కిరణ్‌కుమార్, సెల్స్ మేనేజర్ వెంకట్రాంరెడ్డి, హరూన్ బజాజ్ ఎండీ మహ్మద్‌ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.